


**మ**నుష్యుల మనస్సులు మహా విచిత్రంగా వుంటాయి. ''—భగవంతుడు పాపుల్ని శిక్షిస్తాడు, పుణ్యాత్ముల్ని రక్షిస్తాడు-'' అని చెప్పిన రోజుల్లో ''-మనని ఎలాగూ రక్షించడు గదా-'' అనుకుని పాపాలే చేశారట పాపులంతా.

''—పాపులను రక్షించుటయే దేవుని పని-'' అని చెప్పిన రోజుల్లో, ''-పాపుల్ని రక్షించేటట్లయితే, మనం పుణ్యాలు చెయ్యడం ఎందుకు దండగ?-'' అనుకుని పుణ్యాత్ములు కూడా పాపపు పనులే చెయ్యసాగారట.

ఇది గమనించిన ఒక అభినవ మత రాజాచార్యుడు- పాపపుణ్యాలు గురించి, స్వర్గ నరకాల గురించి ప్రజల్లో సరైన అవగాహన తేవాలని బయల్దేరాడు.

ఒక అరటి తోట దగ్గర నిలబడి ఉపన్యాసం మొదలెట్టాడు. పడగెత్తిన పాములా, తోక ఎత్తి ఎద్దులా విజృంభించాడు. వందల మంది గుమికూడారు. ఇసక వేశాడు అ.మ.రా.చార్యుడు. రాలడం లేదు. మరి కొంచెం వేశాడు. ఊహు! ఏమీ రాలడం లేదు. ఇసక వేసిన కొద్దీ జనాల తలలు కనిపించడం లేదు. రాలని ఇసక, జనాల తలల మీదే వుండిపోతోంది. అంతా ఇసకే! తలలు కనిపించడం లేదు.

మైకు లేకుండానే మైకంలో పడ్డాడు. అ.మ.రా. చార్యుడు,'' బిడ్డలారా! పుణ్యానికి స్వర్గం! పాపాలకి నరకం! పుణ్యాలు చెయ్యండి. స్వర్గం లభించడమే కాక నరకం నశిస్తుంది.

''స్వర్గం ఎలా వుంటుందనుకుంటున్నారు? ఎప్పుడూ చల్లని చందమామ వుంటాడు. నక్షత్రాలు చేతికందుతూ, పువ్వుల్లా మెరుస్తూ వుంటాయి. కమ్మని పూల వాసనలు మత్తెక్కిస్తూ వుంటాయి. అందరూ జంట జంటలుగా, జలకాలాడుతూ విహరిస్తూ వుంటారు. చిలకలు, గోరింకలు, నెమళ్ళు, కోయిలలు- కమ్మని సంగీతం వినిపిస్తూ వుంటాయి. క్రింద నేల వుండదు. ఆకాశమే అద్దంలా మెరుస్తూ వుంటుంది. అందమైన మీ ఆకారాలు అందులో ప్రతిఫలిస్తూ ఆహ్లాదకరంగా వుంటాయి. అర్థమైందా?'' అని అరిచాడు ఆచార్యుడు.

అర్థమైంది అన్నట్టుగా ఇసక దిబ్బ కదిలింది.

''అయితే, వెంటనే స్వర్గానికి వెళ్ళదలుచుకున్న వాళ్ళు చేతులెత్తండి'' అన్నాడు.

సగం దిబ్బలోంచి చేతులు పైకి లేచాయి. పరిశీలించాడు అ.మ.రా. చార్యుడు. ఇంకా సగం మంది చేతులెత్తాలి. — వీళ్లకి స్వర్గం గురించి చెప్పకూడదు, నరకం గురించి కొంచెం వర్ణిస్తే చాలు! దెబ్బకి చేతులెత్తేస్తారు-'' అనుకుంటూ అటు పడగా, ఇటు తోకా రెండూ ఎత్తేశాడు.

''బిడ్డలారా! ఖబడ్దార్! నరకంఅంటే ఏమిటనుకుంటున్నారో? డొక్క చిరిగిపోతుంది. ఎండా, వెన్నెలా ఇలాటి వేమీ ఉండ వక్కడ! అన్నీ మంటలే! నేల, ఆకాశం వుండదు. అన్నీ ముళ్ల కంపలే!

''మురికి కాలవలు, పెంటకుప్పలు, చెత్త దిబ్బలే నివాసాలు! ఇప్పుడు మాత్రం చెత్త దిబ్బల్లో కాక మహా భవనాల్లో నివసిస్తున్నామా అని అనుకో కండి! మీ ఇళ్ల దగ్గర వున్న చెత్త దిబ్బల్లో, మురికి కాలవల్లో వున్నది చెత్తా, మీ మురికే నరకంలో అందరి మురికీ అందరి చెత్తా వుంటాయి. రాజకీయ నేతల మురికీ, చెత్తా కూడా అందులోనే వుంటాయి. జాగ్రత్త!

''అంతా చీకటి! ఎటు పారిపోవాలో తెలీదు. ఎటుపోయినా, తేళ్ళూ, మండ్రగబ్బలూ, జెర్రులూ కుట్టేస్తూ వుంటాయి. నరకం నరకం అంటూనే నరక భటులు మన్ని పట్టుకుని నరికేసి, శూలాలకి గుచ్చేస్తారు. సలసల కాగే నూనెలో వేయిస్తారు. నిప్పుల్లో కాలుస్తారు.

కాబట్టి మిరిప్పుడేం చేస్తారు? పుణ్యాలు చేస్తారు. పుణ్యాలు చెయ్యండి. నరకం నశిస్తుంది. స్వర్గం లభిస్తుంది. అర్థమైందా?'' అరిచాడు ఆచార్యుడు.

దిగ్భ్రాంతి చెందిన ఇసక దిబ్బ కదల్లేదు. ''ఇప్పుడు నాతో స్వర్గానికి రాదలుచుకున్నా వాళ్లంతా చేతులెత్తండి'' అన్నాడు ఆచార్యుడు.

దెబ్బకి దెబ్బ దిబ్బంతా అరగజం ఎత్తుపైకి లేచింది. ఇసక దిబ్బ చివర్న ఈత చెట్టులాగా, దూరంగా వున్న ఓ ముసలాయన చెయ్యి ఎత్తలేదు. దిబ్బ మీంచి అమాంతం అక్కడికో దూకు దూకాడు ఆచార్యుడు.

''ఏం! ఏం! నీకు స్వర్గానికి వెళ్ళాలని లేదా?'' గర్జించాడు.

''ఎందుకు లేదు? ఉంది'' అన్నాడు భయం భయంగా లేచి నిలబడ్డ ముసలాయన. మరైతే చెయ్యెత్త లేదేం?'' గద్దించాడు అ.మ.రా. చార్యుడు.

''తమరి ధోరణి చూస్తే, ఇప్పుడే స్వర్గానికి పంపించేటట్టున్నారండి. నాకిప్పుడప్పుడే రావాలని లేదు. ఈళ్ళందర్నీ తీసుకుని ముందు తమ రెల్లండి. నేను తర్వాత తీరుబడిగా వస్తాను.'' అని వెనక్కి తిరిగాడు ముసలాయన.

ఒక్క డొప్ప మాత్రమే విడిచిన అరిటి పువ్వు— ఎత్తుగా ముక్కు మాత్రమే కనిపించేట్టు తలవెనక్కి వంచి, నాలిక బయటపెట్టి ఎక్కిరిస్తున్న ముఖంగా వుంది.

——విశ్వనాథ పావనిశాస్త్రి




